RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




| హైదరాబాద్ | సోమవారం 29-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 273 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి |
|---|---|---|---|---|---|



# మేం సిద్ధం.. మీరు సిద్ధమా?

- ప్రజలకు ఎవరేం చేశారో తేల్చుకుందాం
- బీఆర్ఎస్, బీజేపీలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహిద్దాం
- మా పాలన, బీఆర్ఎస్ పాలన,దేశంలో బీజేపీ పాలనపై చర్చిద్దాం
- మేం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం
- ప్రజలు తమకు అండగా నిలవాలన్న సీఎం

రాష్ట్రంలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన, దేశంలో 12 ఏళ్ల బీజేపీ పాలన, మేనిఫెస్టోలపై చర్చించేందుకు తాము సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఉద్యమం, ఆత్మ బలిదానాలపై కూడా చర్చిద్దామని, ప్రజలకు ఎవరేం చేశారో తేల్చుకుందామని అన్నారు. 'మీరు స్పీకర్‌కు లేఖ రాయండి.. అసెంబ్లీ, మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహిద్దాం. ఎన్ని రోజులైనా చర్చిద్దాం.. ఇందుకు మీరు సిద్ధమా..' అని సవాల్ విసిరారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13 వేల కోట్లతో నిర్మించనున్న హ్యామ్ రోడ్లకు నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అక్కడి వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన హ్యామ్ రోడ్ల పైలాన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

# ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్.

### చంద్రబాబుతో భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ మిట్టల్ భేటీ
### రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలపై కీలక చర్చలు
### డేటా సెంటర్లు, కనెక్టివిటీ, అండర్ సీ కేబుల్‌పై ప్రధానంగా దృష్టి
### చర్చలు ఫలప్రదంగా సాగాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక సమావేశం నిర్వహించారు. ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన కనెక్టివిటీని అందించడం, డిజిటల్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది.



## అది ప్రభుత్వమా, గూండాల రాజ్యమా?

- అమరావతిలో వైసీపీ నేతలపై జరిగిన దాడిని ఖండించిన జగన్
- చంద్రబాబే ఈ దాడిని ఉసిగొల్పారని తీవ్ర ఆరోపణ
- ఈ దుష్ట సంప్రదాయానికి రెట్టింపు స్పందన ఉంటుందని హెచ్చరిక
- రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్నారా లేక గూండాల రాజ్యాన్ని కొనసాగిస్తున్నారా?



2లో



## మన కథ ముగిసె...

- చివరి లీగ్ మ్యాచ్‌లో పరాజయం
- 6 వికెట్లతో నెగ్గిన ఆస్ట్రేలియా
- మెరిసిన పెర్రీ, గార్డ్‌నర్ హర్మన్ మెరుపులు వృథా

2లో

## తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది



- బెంగాల్ తరహాలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని శ్రేణులకు పిలుపు
- అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని వ్యాఖ్య
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరమని స్పష్టం

## మిస్టర్ రేవంత్.. రోజులు లెక్కపెట్టుకో

- నా ఎత్తు, పొడవుతో నీకేం పని?
- దమ్ముంటే ప్రజాక్షేత్రంలోకి రా.. తేల్చుకుందాం
- సింగరేణి టెండర్ బాగోతాలపై చర్చకు సిద్ధమా?
- నల్లగొండ సభలో సీఎం రేవంత్‌వి అన్ని అబద్ధాలే: హరీశ్‌రావు ఫైర్



2లో



## హిందూ మహాసముద్రం అవకాశాల సంద్రం

- భారత్, సీషెల్స్‌ల ఉమ్మడి ఇల్లు ఈ సముద్రమే
- ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు సముద్ర భద్రతే కేంద్రం
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య
- సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీతో చర్చలు

విక్టోరియా: భాగస్వామ్యం అనేది దేశ పరిమాణంపై కాకుండా పరస్పర గౌరవం, విశ్వాసంపై ఆధారపడి ఉండాలని భారత ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. ఆర్థిక శ్రేయస్సుతో పాటు సముద్ర భద్రత కూడిన సుసంపన్న హిందూ మహాసముద్రాన్ని భారతదేశం ఆకాంక్షిస్తోందని అన్నారు. భారత్, సీషెల్స్ దేశాల రక్షణ, భద్రతలు ఒకదానికొకటి విడదీయరానివని స్పష్టంచేశారు. హిందూ మహాసముద్రాన్ని అవకాశాల సముద్రంగా మార్చడమే తమ ధ్యేయమని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ ఆదివారం సీషెల్స్‌లోని విక్టోరియా నగరంలో సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీతో సమావేశమయ్యారు. ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. హెర్మినీతో భేటీ అనంతరం మోదీ మాట్లాడారు. హిందూ మహాసముద్రం మన ఉమ్మడి ఇల్లు అని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

## పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?..

- స్మార్ట్ కిచెన్లపై జగన్ ఆరోపణలను ఖండించిన మంత్రి లోకేశ్
- ఉన్నవారి ఉపాధికి ధోకా లేకుండానే అదనపు ఉద్యోగాలు కల్పిస్తున్నామని వెల్లడి
- కుక్-కమ్-హెల్పర్ల వేతన బకాయిల ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ
- పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యమని వివరణ
- పేదల సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శ

ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ల వ్యవహారంపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎవరి ఉపాధి పోదని, పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని ఆయన విమర్శించారు.



## ద్రోణి ప్రభావంతో పలుచోట్ల వర్షాలు

### మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు వాతావరణ శాఖ వెల్లడి

అమరావతి: ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరాంధ్ర తీరప్రాంతం నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా మహారాష్ట్ర వరకు ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు మరో ద్రోణి విస్తరించి ఉన్నట్లు పేర్కొంది. వీటి ప్రభావంతో ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంతంలో 6.8 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. విజయనగరం జిల్లా రాజాంలో 5.2, గుంటూరు జిల్లా కాకుమానులో 5.1, తాడేపల్లిలో 4.5, ఎన్టీఆర్ జిల్లా కవులూరులో 4.1, బాపట్ల జిల్లా భట్టిప్రోలులో 3.9 సెంటీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.



## ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్..

ఈ భేటీలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సునీల్ మిట్టల్‌తో జరిగిన చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్ డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతం, పౌరులకు మెరుగైన కనెక్టివిటీని అందించడంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టులో భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా ఇప్పటికే భాగస్వామిగా ఉంది. భారీ పెట్టుబడులతో, స్వచ్ఛ ఇంధనంతో నడిచేలా రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2026 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టును 2028 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే భాగస్వామ్య సంస్థలను కోరారు.

## మిస్టర్ రేవంత్.. రోజులు లెక్కపెట్టుకో

సిద్దిపేటజోన్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అంటే భయం పట్టుకుంది. నిద్రలో కూడా వణుకు మొదలైంది. ఆయన చెప్పకనే చెబుతున్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుంది. ఆయన తప్పులు చేశారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు అని అర్థమైంది. అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. మిస్టర్ రేవంత్‌రెడ్డి.. రోజులు లెక్కపెట్టుకో..ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు'అని మాజీమంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. నల్లగొండ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆదివారం సిద్దిపేటజిల్లా కేంద్రంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో హరీశ్‌రావు స్పందించారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల సమావేశ మతలబు గురించి అడిగితే దానికి బదులు ఇవ్వకుండా, సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ సభలో నా పొడవు, ఎత్తు గురించి మాట్లాడి తప్పించుకోవాలని చూస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులు ముంచి ముంపుమేస్త్రీగా మారొద్దని ప్రశ్నిస్తే బదులు లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మనస్సు, ఆలోచన, బుద్ధి అంతా పొట్టిదేనని ఎద్దేవా చేశారు. 2034 వరకు అధికారంలోనే ఉంటామని మాట్లాడిన రేవంత్‌రెడ్డికి నిజంగా నమ్మకం ఉంటే అసెంబ్లీ రద్దు చేయాలని, ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. లేకుంటే పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజల్లోకి పోదామని, దమ్మూధైర్యం ఉంటే తన సవాల్ స్వీకరించాలన్నారు. రైతుభరోసా ద్వారా రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నా అని అంటున్న సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రైతు భరోసా, రైతుబీమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రైతుల కళ్లల్లో కన్నీళ్లు వచ్చేలా చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ముందు తెలంగాణ రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో 12 మీటర్లు కూడా తవ్వలేదని, అన్యాయంగా ఎనిమిది మంది అమాయక కార్మికులు చనిపోతే వారి శవాలను కూడా తీయలేని అసమర్థ ప్రభుత్వం అని విమర్శించారు. సింగరేణి అవినీతి బహిర్గతం చేస్తే అసలు టెండర్లు కాలేదని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సృజన్‌రెడ్డికి టెండర్లు దక్కింది రుజువు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం కూలింది అని ఆరోపణలు చేసిన సీఎం ఇప్పుడు హైదరాబాద్ తాగునీరు, మూసీకి ఎక్కడి నీళ్లు తరలిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో తన పాత్రపై సీఎం వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యమ సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు వెళ్తూ తుపాకీ గురి పెట్టిన రేవంత్‌రెడ్డి చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు. తెలంగాణ ఉద్యమం, త్యాగం గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడితే తెలంగాణ ప్రజలు నవ్వుకుంటారని చెప్పారు.

## పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?..

ఉపాధి కల్పనపై మాట్లాడుతూ.. "వైఎస్సార్ కడప జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు స్మార్ట్ కిచెన్లు ప్రారంభించాం. వాటి పరిధిలోని 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా తమ విధుల్లో కొనసాగుతున్నారు. త్వరలో జిల్లాలో ఏర్పాటు చేయబోయే మరో 33 స్మార్ట్ కిచెన్ల వల్ల కూడా ఏ ఒక్కరి ఉపాధికీ నష్టం వాటిల్లదు. పైగా, ఈ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలకు అదనంగా 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు ఉపాధి లభించబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి అదనపు ఉపాధి కల్పిస్తుంటే జగన్ ఎందుకు ఏడుస్తున్నారు? పేదలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదా?" అని లోకేశ్ ప్రశ్నించారు. వేతనాల బకాయిల ఆరోపణలను కూడా లోకేశ్ తోసిపుచ్చారు. "కడప జిల్లాలోని 3,450 మంది కుక్-కమ్-హెల్పర్లకు 2026 ఏప్రిల్ నెల వరకు జీతాలు పూర్తిగా చెల్లించాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గౌరవ వేతనం చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిల గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## అది ప్రభుత్వమా, గూండాల రాజ్యమా?

రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్నారా లేక గూండాల రాజ్యాన్ని కొనసాగిస్తున్నారా? అంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిలో పర్యటిస్తున్న వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను చంద్రబాబే స్వయంగా ఉసిగొల్పారని ఆరోపిస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన వరుస పోస్టులు చేశారు. రాజధాని ప్రాంత రైతుల ఆహ్వానం మేరకు సీఆర్డీయే పరిరక్షణ కమిటీతో కలిసి వెళ్తున్న తమ పార్టీ నేతలపై దాడి చేయించడం ద్వారా పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని హననం చేశారని జగన్ మండిపడ్డారు. కొందరు పోలీసు అధికారులు దగ్గరుండి ఈ దాడిని సమన్వయం చేయడం అత్యంత దారుణమని విమర్శించారు. అమరావతి పేరుతో జరుగుతున్న అవినీతి, రైతులపై సాగుతున్న దౌర్జన్యాలు బయటపడకుండా ఉండేందుకే ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూములు ఇవ్వని రైతులను భూసేకరణ నోటీసులతో వేధించడం, వారి పొలాలకు వెళ్లే మార్గాలను ధ్వంసం చేయడం, అక్రమంగా మట్టి తవ్వకాలు జరపడం వంటి దారుణాలకు ప్రభుత్వం ఒడిగడుతోందని జగన్ ఆరోపించారు. కొండవీటి వాగు నీటిని బలవంతంగా పొలాల్లోకి మళ్లించి, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేడు మీరు మొదలుపెట్టిన ఈ దుష్ట సంప్రదాయానికి, భవిష్యత్తులో రెట్టింపు స్పందన ఉంటుంది. ప్రజలు మిమ్మల్ని ఎన్నటికీ క్షమించరు," అని చంద్రబాబును హెచ్చరించారు.

# హిందూ మహాసముద్రం అవకాశాల సంద్రం

సముద్ర భద్రత, సుస్థిరత, శ్రేయస్సు మన ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. భారతదేశపు మహాసాగర్ (ప్రాంతాలవ్యాప్తంగా భద్రత, వృద్ధి కోసం పరస్పర మరియు సంపూర్ణ పురోగతి) దార్శనికతకు ఇదే మూలమని తెలిపారు.

### వృద్ధి కోసం నూతన అవకాశాల అన్వేషణ

భారత్, సీషెల్స్ మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్దడంపై చర్చించినట్లు ప్రధానమంత్రి వెల్లడించారు. పరిశ్రమలు, అనుసంధానం, టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు సహా ఇతర రంగాల్లో వృద్ధి కోసం రెండు దేశాలు నూతన అవకాశాలను అన్వేషిస్తాయని చెప్పారు.

### వాతావరణ మార్పులపై పోరాడుదాం

తర్వాత సీషెల్స్ నేషనల్ అసెంబ్లీలో మోదీ మాట్లాడారు. వాతావరణ మార్పుల వల్ల గ్లోబల్ సౌత్ దేశాలు.. ముఖ్యంగా ద్వీప దేశాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. వాతావరణ మార్పుల ప్రభావాలు ఇప్పటికే తీరప్రాంతాలు, సముద్ర జీవావరణ వ్యవస్థలు, వాతావరణ సరళి, సమాజాలపై కనిపిస్తున్నాయని చెప్పారు. ఆయన ఆదివారం సీషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రసంగించారు. వాతావరణ మార్పులకు అతి తక్కువగా కారణమైవారు దాని పర్యవసానాల అత్యధిక భారాన్ని మోయకూడదని స్పష్టంచేశారు. వాతావరణ మార్పుల నియంత్రణకు ప్రపంచ దేశాలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరింత సమ్మిళిత ప్రపంచం,



సమకాలీన వాస్తవాలను ప్రతిబింబించే అంతర్జాతీయ సంస్థల పట్ల భారత్, సీషెల్స్ ఒకే దృక్పథాన్ని పంచుకుంటున్నాయని గుర్తుచేశారు. గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతను చాటుతున్నాయని పేర్కొన్నారు.

### 19 కీలక అంశాలపై నిర్ణయం

రక్షణ, సముద్ర భద్రత, డిజిటల్ చెల్లింపులు, అంతరిక్షం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని భారత్, సీషెల్స్ తీర్మానించుకున్నాయి. భారత ప్రధాని మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినీ మధ్య ఆదివారం జరిగిన చర్చల్లో 19 అంశాలపై నిర్ణయానికి వచ్చారు. ఇందులో నేరస్తుల అప్పగింత ఒప్పందం, బాహ్య అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడంలో సహకార ఒప్పందం, సీషెల్స్‌లో యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఒప్పందం, ఎక్స్‌పోర్ట్--ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సమగ్ర రుణ ఒప్పందం, నూతన సీషెల్స్ జాతీయ ఆసుపత్రికి సహకార ఒప్పందం ఉన్నాయి. సీషెల్స్‌కు ఒక వేగవంతమైన గస్తీ నౌకను బహుమతిగా ఇవ్వడం, రక్షణ దళానికి 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ తరగతి పడవలను అప్పగించడం, తీర రక్షక దళం బలోపేతానికి సహకరించడం, గ్లాస్ కాక్‌పిట్‌తో ఒక డోర్నియర్ విమానాన్ని ఉన్నతీకరించడం వంటి అంశాలను ఇరు పక్షాలు ప్రకటించాయి. దౌత్య శిక్షణ కోసం సుష్మా స్వరాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ సర?వస్, సీషెల్స్ విదేశీ వ్యవహారాల శాఖ మధ్య ఒప్పందం కుదిరింది.

### మోదీకి సీషెల్స్ గౌరవ పురస్కారం ప్రదానం

ప్రధాని మోదీకి సీషెల్స్ ప్రభుత్వం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్'అనే గౌరవ పురస్కారాన్ని ప్రదానం చేసింది. సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినీ ఆయనను ఈ పురస్కారంతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల మోదీ చూపుతున్న నిబద్ధత, చిన్న ద్వీప దేశాల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషికి ఈ గౌరవాన్ని అందించారు. వాతావరణ మార్పులు విసురుతున్న సవాళ్లతో పోరాడుతున్న దేశాలకు, పర్యావరణ పరిరక్షణను భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతగా భావిస్తున్న దేశాలకు అవార్డ్‌ను అంకితం చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు.

# మన కథ ముగిసె...

లండన్: టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు తడబడింది. మొదట బ్యాటింగ్‌లో మంచి స్కోరు చేసినా... దాన్ని కాపాడుకోవడంలో విఫలమై వరల్డ్‌కప్ నుంచి ని?ష్క్రమించింది. గ్రూప్--1లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 6 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. గ్రూప్ దశలో ఐదు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు పరాజయాలతో 6 పాయింట్లకే పరిమితమైన భారత్... గ్రూప్‌లో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆస్ట్రేలియా (10 పాయింట్లు), నాలుగింట గెలిచిన దక్షిణాఫ్రికా (8 పాయింట్లు) సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. కీలక పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు. కెపట?టన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 56; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధశతకంతో చెలరేగగా... స్మృతి మంధాన (37 బంతుల్లో 38; 6 ఫోర్లు), షఫాలీ వర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 34; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లకు 172 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలీస్ పెర్రీ (38 బంతుల్లో 56; 8 ఫోర్లు), ఆష్లే గార్డ్‌నర్ (29 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. భారత బౌలర్లలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణి 2 వికెట్లు పడగొట్టింది. ఆదివారమే జరిగిన మరో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌తో ఆస్ట్రేలియా; గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఇంగ్లండ్ తలపడతాయి. ఓపెనర్లు మెరుగైన ఆటతీరు కనబర్చడంతో... టీమిండియాకు శుభారంభం దక్కింది. స్మృతి, షఫాలీ తొలి వికెట్‌కు 66 పరుగులు జోడించారు. షఫాలీ అవుటైన కాసేపటికే లేని పరుగు కోసం ప్రయత్నించి స్మృతి రనౌట్ అయింది. జెమీమా ఆశించినంత వేగంగా ఆడలేకపోవడంతో... 18 ఓవర్లు ముగిసేసరికి టీమిండియా 134/2తో నిలిచింది. అయితే ఆఖర్లో హర్మన్ దంచికొట్టడంతో జట్టు మంచి స్కోరు చేయగలిగింది. హర్మన్ 19వ ఓవర్‌లో ఓ ఫోర్ కొట్టగా... జెమీమా సిక్స్ బాదింది. దీంతో 13 పరుగులు రాగా... ఆసీస్ సారథి మొలినెక్స్ వేసిన ఆఖరి ఓవర్‌లో హర్మన్ 'హ్యాట్రిక్' సిక్స్‌లతో స్టేడియాన్ని హోరెత్తించింది.

# తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది



తెలంగాణలో త్వరలోనే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన శంషాబాద్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనితో పాటు మరో తొమ్మిది జిల్లాల కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కనబరిచిన పోరాట పటిమను తెలంగాణలోనూ పునరావృతం చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలన సాగిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడంలో బీజేపీ కీలక పాత్ర పోషించగా, ఆ ఫలితాన్ని కాంగ్రెస్ తనకనుకూలంగా మార్చుకుని లబ్ధి పొందిందని ఆయన వ్యాఖ్యానించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గల్లీ, మొహల్లాకు పార్టీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్' సర్కారు ఉంటేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అంతకుముందు, శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నితిన్ నబిన్‌కు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు తదితరులు ఘన స్వాగతం పలికారు.

# మేం సిద్ధం.. మీరు సిద్ధమా?

'మా ప్రజా ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే.. కాంగ్రెస్ రెండున్నరేళ్లలో ఏమీ చేయలేదని బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కేసీఆర్ శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉంటే కేటీఆర్, హరీశ్‌లు బిల్లారంగా తరహాలో తెలంగాణలో తిరుగుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం పోవాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి ప్రజలు అలా ఏమీ కోరుకోవడం లేదు. వారి కుటుంబం, వారికి సంబంధించిన వారే కోరుకుంటున్నారు. సింగరేణిలో టెండర్ ప్రక్రియ పూర్తి కాకముందే ఆరోపణలు చేశారు. వారు ఎన్ని నాటకాలు వేసినా తెలంగాణ ప్రజలు నమ్మరు. వారు సామాజికంగా బీఆర్ఎస్‌ను బహిష్కరించారు. 2034 వరకు మేమే అధికారంలో ఉంటాం. పదేళ్లు వెనక్కు తిరగకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం. మాకు ప్రజలు అండగా ఉండాలి..' అని సీఎం కోరారు. 'బీఆర్ఎస్ త్యాగాల పునాదులపై తెలంగాణ వచ్చిందన్నారు. మీవి త్యాగాలా? ఆ పేరుతో రాజీనామాలు చేసి ఎన్నికలు తెచ్చి కలెక్షన్లు చేశారు. మీరు చేసినవే త్యాగాలంటే.. కొండా లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన త్యాగాలను ఏమనాలి? 1969 తొలి తెలంగాణ



ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవికి రాజీనామా చేసి మళ్లీ మంత్రి పదవి తీసుకోలేదు. మలి దశ ఉద్యమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి పదవి వదిలేసి, నల్లగొండ గడ్డపై తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేశారు. తెలంగాణ వచ్చాకే పదవి తీసుకుంటానని ప్రతినబూని వచ్చాకే మళ్లీ మంత్రి పదవి తీసుకున్నారు. రూ.100 పెట్రోలు తెచ్చుకుని 1 రూపాయి అగ్గిపెట్టె తెచ్చుకోలేని హరీశ్‌రావుది త్యాగమా? శ్రీకాంతచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్యలది త్యాగమా? అగ్గిపెట్టె హరీశ్‌రావు ఆర్థిక మంత్రిగా, నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేసినప్పుడు తెలంగాణ అప్పులు రూ.69 వేల కోట్లు ఉంటే బీఆర్ఎస్ పాలనలో రూ.8.11 లక్షల కోట్లకు పెంచారు. అలాంటి వారి దోపిడీని ప్రజలు ఇంకా సహించాలా? పదేళ్లలోనే వందేళ్ల విధ్వంసాన్ని సృష్టించిన మిమ్మల్ని ఏమనాలి?..' అని రేవంత్ ప్రశ్నించారు. 'రూ.16 వేల కోట్లు పెట్టి పేదలకు సన్న బియ్యం ఇస్తున్నాం. ఫామ్ హౌస్‌లో ఉండే కేసీఆర్ ఏం తింటున్నారో, తండాలో ఉండే గిరిజన బిడ్డలు కూడా ఆ సన్న బియ్యమే తింటున్నారు. బీఆర్ఎస్ నేతలకు డౌటు ఉంటే తండాలు, గూడేలకు వెళ్లి సన్న బియ్యం తింటున్నారో? లేదో? చూసి రావాలి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదు. మేము రెండున్నరేళ్లలో 4.5 లక్షల ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ నేతలకు కడుపు మండుతోంది. పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న వారికి కడుపుమంట ఎందుకు? తండ్రి, కొడుకు, అల్లుడికి ఫామ్ హౌస్‌లు, పదవులు తప్ప ప్రజల గురించి ఆలోచనే లేదు. పరీక్షలు పెట్టి పేపర్లు అమ్ముకుని వేల కోట్ల అక్రమాలకు పాల్పడ్డారు..' అని సీఎం దుయ్యబట్టారు.



## ఎల్లంపేట మున్సిపాలిటీ 15వ వార్డులో ఓటరు జాబితా పంపిణీ

ఎల్లంపేట, జూన్ 29: ఎల్లంపేట మున్సిపాలిటీ 15వ వార్డులో ఓటరు జాబితా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాతి వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో వార్డుకు సంబంధించిన ఓటరు జాబితాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాతి వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరూ తమ పేర్లు, కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. పేరు నమోదు కాకపోయినా, తప్పులు ఉన్నా లేదా చిరునామా మార్పులు అవసరమైనా సంబంధిత అధికారులను సంప్రదించి సవరణలు చేయించుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వార్డు నివాసితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఓటరు జాబితాలను స్వీకరించారు.

## ఎల్లంపేట 15వ వార్డులో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం



**ఎల్లంపేట, జూన్ 29:** ఎల్లంపేట మున్సిపాలిటీ 15వ వార్డులో ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ లిలినాతి వేణుగోపాల్ గౌడ్‌లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చిన్నారుల రోగనిరోధక శక్తిని పెంపొందించే టీకాలు, పోలియో చుక్కలు అత్యంత అవసరమని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాల్సిన చిన్నారులను గుర్తించి సేవలందిస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ల సేవలను ఆయన అభినందించారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శంకరయ్య, బిక్షపతి, కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రెగ్నెన్సీని వాయిదా వేస్తున్నారా? గైనకాలజిస్ట్: డాక్టర్ చైతన్య రెడ్డి..

**శంకర్ పల్లి; జూన్ 28:** దేశంలోని చాలా జంటలు కెరీర్ లేదా పర్సనల్ గోల్స్ కోసం పిల్లలు కనడాన్ని వాయిదా వేస్తుంటాయని శంకర్‌పల్లి మెగా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వయసు పెరిగే కొద్దీ పురుషులు, మహిళల్లో ఫెర్టిలిటీ తగ్గిపోతుందని హెచ్చరించారు. మహిళల్లో 30 ఏళ్లు దాటాక ఎగ్స్ సంఖ్య, క్వాలిటీ తగ్గి పోతాయన్నారు. దీంతో ప్రెగ్నెన్సీలో సమస్యలు రావొచ్చని చెబుతున్నారు. 30 ఏళ్లలోపే ఫెర్టిలిటీ హెల్త్ చెక్ చేసుకొని అందుకు తగినట్టు ప్లాన్ చేసుకోవాలని సూచించారు. అపాయింట్మెంట్ కొరకు ఈ (9000066335) నెంబర్ ద్వారా సంప్రదించాలని డాక్టర్ చైతన్య రెడ్డి కోరారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రజలు సహకరించాలి

### శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్

**శంకర్ పల్లి; జూన్ 28:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రజలు సహకరించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధి అన్ని వార్డుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేపట్టారు. ఫారాల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అధి కారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదే శించారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ సిబ్బందికి అవసరమైన సమా చారం, పత్రాలను అందజేసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్ వీరకుమార్ ఉన్నారు.

# లోతుకుంటలో హైడ్రా చర్యలపై వివాదం

## 40 ఎకరాల భూమిలో 15 ఎకరాలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారంటూ ఆరోపణలు



హైదరాబాద్:లి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా లోతుకుంటలోని 40 ఎకరాల ప్రైవేట్ భూమికి సంబంధించి హైడ్రా చర్యలు వివాదాస్పదంగా మారాయి. భూమిలో 15 ఎకరాలు అప్పగించాలని యజమానులపై ఒత్తిడి తెచ్చారని, ఇందుకోసం హైడ్రాను వినియోగించారంటూ తీవ్ర ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఆరోపణలను తాజాగా 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం ప్రస్తావించింది. కథనం ప్రకారం, లోతుకుంట గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలో నిర్మాణ పనులు జరుగుతుండగా, ఈ ఏడాది జూన్ 4న హైడ్రా అధికారులు అక్కడికి చేరుకుని పనులను నిలిపివేశారు. నిర్మాణ సంస్థ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, హైడ్రా సిబ్బంది పలురోజుల పాటు అక్కడే ఉండి పనులు జరగకుండా అడ్డుకున్నట్లు పేర్కొంది. ఈ భూమి ప్రైవేట్ ఆస్తేనని గతంలో హైకోర్టు స్పష్టం చేసినప్పటికీ, "చారిత్రక బండరాళ్ల సంరక్షణ" పేరుతో హైడ్రా మళ్లీ జోక్యం చేసుకుందని కథనం ఆరోపించింది. అనంతరం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన హైకోర్టు, ప్రైవేట్ భూముల్లో హైడ్రా జోక్యం చట్టబద్ధం కాదని వ్యాఖ్యానించినట్లు తెలిపింది.

### 15 ఎకరాల వాటా కోరారనే ఆరోపణ

భూమిపై వివాదం కొనసాగుతున్న సమయంలో ఓ మంత్రి ఆసక్తి చూపారని, మొదట 40 శాతం భూమి (సుమారు 16 ఎకరాలు), చివరకు 15 ఎకరాలైనా ఇవ్వాలని సంబంధిత వ్యక్తులపై ఒత్తిడి తెచ్చారని కథనం పేర్కొంది. అయితే భూమి యజమానులు అందుకు నిరాకరించినట్లు తెలిపింది. ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి స్పందన వెలువడలేదు.

### భూమి చరిత్ర

1933లో నిజాం ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఈ భూమిని లతీఫ్ ఉన్నిసా బేగం కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని కథనం పేర్కొంది. అనంతరం పలుమార్లు యాజమాన్యం మారగా, రైల్వే లైన్, పీఎస్సీ గ్రావిటీ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఈ భూమిలో కొంత భాగాన్ని సేకరించి, అప్పటి యజమానికి పరిహారం కూడా చెల్లించినట్లు వివరించింది.

### హైకోర్టు వ్యాఖ్యలు

హైడ్రా చర్యలపై విచారణ సందర్భంగా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు కథనం పేర్కొంది. ప్రైవేట్ భూముల్లో హైడ్రా జోక్యం చేసుకోవద్దని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే పరిమితం కావాలని స్పష్టం చేసినట్లు తెలిపింది. చట్టానికి అతీతంగా వ్యవహరించరాదని హెచ్చరించిన కోర్టు, ఇకపై ఆ భూమిలో జోక్యం చేసుకోబోమని హైడ్రా తరఫున హామీ ఇచ్చినట్లు పేర్కొంది. అయితే ఈ వ్యవహారంలో చేసిన ఆరోపణలపై సంబంధిత మంత్రి, హైడ్రా లేదా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక స్పందన ఇంకా వెలువడాల్సి ఉంది.

# అంతర్జాతీయ వేదికపై మరో చరిత్ర సృష్టించిన డా. కొప్పుల విజయ్ కుమార్..

## మానవతా సేవ, న్యాయ సేవ, సామజిక సేవా రంగాల్లో ఒకేసారి ఏడు వరల్డ్ రికార్డ్స్..



**శంకర్ పల్లి; జూన్ 28:** అంతర్జాతీయ అచీవ్‌మెంట్ అవార్డ్స్ కార్యక్రమంలో ఏడు ప్రపంచ రికార్డులు సాధించిన ఘనతకు సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్, న్యాయవాది డా. కొప్పుల విజయ్ కుమార్ ని ప్రముఖులు సత్కరించారు. తమిళనాడులోని హోసూర్ పట్టణంలో న్యాయరంగం, మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక, ప్రజాసేవలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా వివిధ అంతర్జాతీయ సంస్థల నుండి వరుసగా ఏడు ప్రపంచ రికార్డులు లభించడం విశేషం. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ డా. కొప్పుల విజయ్ కుమార్ సాధించిన ఈ అరుదైన ఘనత యువతకు ఆదర్శప్రాయమని, దేశానికి మరియు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని అభినందించారు. అవార్డులను స్వీకరిస్తూ డా. కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ గుర్తింపు తన వ్యక్తిగత విజయమే కాకుండా న్యాయం, మానవ హక్కులు, సామాజిక సేవ పట్ల తన నిబద్ధతకు లభించిన గౌరవమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. "సేవే నా లక్ష్యం... న్యాయమే నా మార్గం... ప్రపంచ గుర్తింపే నా బాధ్యతకు నిదర్శనం." అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ ప్రతినిధులు, అమెరికన్ విస్డం పీస్ యూనివర్సిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## శంకర్ పల్లి మండలం సంకేపల్లి అంగన్వాడి కేంద్రంలో పోలియో చుక్కలు వేసుకున్న చిన్నారులు..

**శంకర్ పల్లి; జూన్ 28:** శంకర్ పల్లి మండలం సంకేపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వైద్య సిబ్బంది వేశారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్వాడి కేంద్రానికి పంపించి పోలియో చుక్కలను వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## తల్లిదండ్రులు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి..

### దొంతాన్ పల్లి సర్పంచ్ ఎండి. అజీజ్..

**శంకర్ పల్లి; జూన్ 28.:** తల్లిదండ్రులు ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందిస్తున్న పల్స్ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని శంకర్ పల్లి మండలం దొంతాన్ పల్లి గ్రామ సర్పంచ్ ఎండి. అజీజ్ అన్నారు. ఆదివారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నపిల్లలకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారి మన దేశం నుండి తరిమి వేయడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఐదు సంవత్సరాల లోపు ఉన్న చిన్నపిల్లలకు పల్స్ పోలియో చుక్కల మందులు సరఫరా చేస్తున్నదని తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి సంవత్సరం తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.



# రాజకీయాల్లోకి అల్లు అర్జున్ ..



టాలీవుడ్‌లో ప్రస్తుతం ఓ ఆసక్తికరమైన చర్చ జోరుగా సాగుతోంది. సినీ రంగంలో స్టార్‌డమ్‌ను ఆస్వాదిస్తున్న పలువురు హీరోలు రాజకీయాల వైపు ఆసక్తి చూపుతున్నారనే వార్తలు ఎప్పటికప్పుడు వినిపిస్తుంటాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో సినిమాల నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టి ప్రజాదరణ పొందిన నాయకుల సంఖ్య ఎక్కువగానే ఉంది. తాజాగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం, తమిళనాడులో దళపతి విజయ్ ఏకంగా సీఎం కావడం సినీ వర్గాల్లో కొత్త చర్చలకు తెరలేపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాజకీయ రంగప్రవేశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న వార్తల ప్రకారం, బన్నీ భవిష్యత్తులో రాజకీయాల్లోకి అడుగుపెట్టేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా తమిళనాడులో విజయ్ అనుసరించిన మోడల్‌ను అధ్యయనం చేస్తూ అదే తరహా రాజకీయ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఫిలింనగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్న కథనాల ప్రకారం, అల్లు అర్జున్ ఇటీవల కొందరు ప్రముఖ రాజకీయ వ్యూహకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ భేటీల్లో భవిష్యత్తు రాజకీయ అవకాశాలు, ప్రజల్లో ప్రభావాన్ని పెంచుకునే మార్గాలు, అభిమాన సంఘాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సమావేశాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. అల్లు అర్జున్ 2034 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని దీర్ఘకాలిక రాజకీయ ప్రణాళికను రూపొందిస్తున్నారనే వార్తలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వెంటనే కాకుండా, ముందుగా అభిమాన సంఘాల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించి, క్రమంగా ప్రజల్లో బలమైన పునాదిని నిర్మించుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అల్లు అర్జున్‌కు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా భారీ అభిమాన గణం ఉంది. 'పుష్ప' ఫ్రాంచైజీ విజయంతో ఆయన పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా బన్నీకి విపరీతమైన ఫాలోయింగ్ ఏర్పడింది. రాజకీయాల్లోకి అడుగుపెట్టే పరిస్థితి వస్తే ఈ అభిమాన బలం ఆయనకు ప్రధాన అస్త్రంగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కూడా అల్లు అర్జున్ రాజకీయ ప్రవేశంపై ఇలాంటి వార్తలు అనేకసార్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ప్రతిసారి ఆయన సన్నిహిత వర్గాలు వాటిని ఖండించాయి. ప్రస్తుతం మరోసారి అదే తరహా ప్రచారం ఊపందుకోవడంతో అభిమానులు కూడా ఆసక్తిగా గమనిస్తున్నారు.

# మహేష్ బాబాయ్ నాకు చాలా ఫీడ్‌బ్యాక్ ఇచ్చాడు





ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు హీరోగా పరిచయం అవుతున్నాడు. కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న రమేష్ బాబు కొడుకు జయకృష్ణ శ్రీనివాస మంగాపురం సినిమాతో హీరోగా ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. జయకృష్ణ డెబ్యూ విషయంలో మహేష్ బాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడట. సినిమా కంటెంట్, ఎమోషన్ అన్నింటినీ దగ్గరుండి గమనించి, తన ఫీడ్‌బ్యాక్ ఇచ్చాడని జయకృష్ణ స్వయంగా వెల్లడించాడు. మహేష్ ఇచ్చిన సూచనలు ఈ సినిమాకు చాలా హెల్ప్ అయ్యాయని జయకృష్ణ చెబుతున్నాడు. శ్రీనివాస మంగాపురం గురించి జయకృష్ణ మాట్లాడుతూ.. ఈ సినిమా లోతైన ఎమోషన్ కలిగిన సినిమా. నటుడిగా నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ఇది సరైన కథ అని పేర్కొన్నాడు. ఈ సినిమాలో రవీనా టాండన్ కూతురు రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తోంది. కృష్ణ జయంతి సందర్భంగా ఈరోజు సినిమాలోని పాత్రలను పరిచయం చేశారు. ఈ చిత్రం జులై 9న థియేటర్లలో విడుదల కానుంది.

**తాతయ్య ఆశీస్సులు నాతో ఉంటాయి**

"తాతయ్య కృష్ణగారు నాకు దేవుడితో సమానం. ఆయన ఎక్కడ ఉన్నా తన ఆశీస్సులు నాతో ఉంటాయని నమ్ముతున్నాను. తాతయ్య పుట్టినరోజు సందర్భంగా మీ అందర్నీ కలవడం హ్యాపీగా ఉంది. హీరో అవ్వాలనే ఆలోచనకు ప్రేరణ మా బంగారు తాతయ్య (కృష్ణ సోదరుడు--నిర్మాత ఆదిశేషగిరి రావు). అలాగే మా బాబాయ్ మహేశ్‌బాబుకి నేను డైహార్డ్ ఫ్యాన్‌ని. ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్‌ను లాంచ్ చేసి, ఫీడ్‌బ్యాక్ ఇస్తూ, నన్ను ప్రోత్సహిస్తున్న మా బాబాయ్‌కి థ్యాంక్స్. ఈ సందర్భంగా మా నాన్న రమేశ్‌బాబుగారిని తలచుకుంటున్నాను. మా తాతగారితో 'అగ్నిపర్వతం', బాబాయ్ మహేశ్‌బాబుగారితో 'రాజకుమారుడు' చేశారు దత్తుగారు. ఇప్పుడు నన్ను హీరోగా పరిచయం చేస్తున్న ఆయనకు రుణపడి ఉంటాను.

ఈ సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. "ఈ సినిమా నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అన్నారు రాషా. "కృష్ణగారు నిజమైన సూపర్‌స్టార్. ఆయన చేసినంత రిస్క్ ఏ హీరో కూడా చేసి ఉండరు. ఆ కృష్ణగారి క్వాలిటీస్ జయకృష్ణలో ఉన్నాయి. జయకృష్ణ పెద్ద హీరో అవుతాడని దర్శకుడు అజయ్ భూపతి అన్నారు. "కృష్ణగారిలాగే జయకృష్ణ కూడా తన ప్రతిభను చూపించాడు" అని పేర్కొన్నారు తమ్మారెడ్డి భరద్వాజ్. "జయకృష్ణ న్యూయార్క్‌లో ఫిల్మ్ కోర్సు చదివాడు. ఈ సినిమాతో జయకృష్ణ హీరోగా పరిచయం కావడం ఆనందంగా ఉంది" అని తెలిపారు ఆదిశేషగిరి రావు. "శ్రీనివాస మంగాపురం' అని పేరు పెట్టడమే ఈ సినిమా మొదటి విజయం" అన్నారు దర్శక--నిర్మాత కె. రాఘవేంద్ర రావు.

# ఆమె నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా

ప్రస్తుతం భారీ అంచనాలతో తెరకెక్కుతున్న పానిండియా సినిమాల్లో 'టాక్సిక్' తొలి వరుసలో ఉంటుంది. 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా కియారా తన తాజా ఇంటర్వ్యూలో 'టాక్సిక్' సెట్‌లో తన అనుభవాలను పంచుకున్నది. 'డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా. టైమ్‌కి చాలా విలువ ఇచ్చేవారామె. ఒకసారి ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌లోకి రాగానే పూర్తిగా పాత్రలోనే ఉండాలి. ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు. నేరుగా క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి' అని సీరియస్‌గా చెప్పారు. నిజానికి నేను ఆ విధానానికి పూర్తి వ్యతిరేకం. సెట్‌లోకి రాగానే ముందు అందర్నీ విష్ చేయడం నాకు అలవాటు. లొకేషన్లో ఉత్సాహంగా ఉండే మనిషిని. కానీ డైరెక్టర్ మాట వినాలి కాబట్టి తను చెప్పినట్టే చేశాను' అని గుర్తు చేసుకున్నది కియారా అద్వాణీ. ఇందులో నదియా అనే పాత్రలో కియారా నటిస్తుండగా, నయనతార గంగ పాత్రలో కనిపించనున్నది. 'ఎలిజిబెత్' అనే పాత్రలో హ్యూమా ఖురేషి, 'రెబెకా'గా తారా సుతారియా, 'మెలిసా' పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనున్నారు.





# టీఎఫ్‌సీసీ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్

సినీరంగంలో ఔత్సాహికుల్ని ప్రోత్సహించేందుకు షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించబోతున్నామని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ తెలిపారు. ఇందులో పాల్గొనడానికి ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, 5 నుంచి 25 నిమిషాల నిడివి గల షార్ట్‌ఫిల్మ్‌లను ఎంట్రీకి పంపించవచ్చని, ఎంట్రీలను జూన్ 13వ తేదీ వరకు స్వీకరిస్తామని చెప్పారు. ఎంపిక చేసిన విజేతలకు జూన్ 21న హైదరాబాద్‌లో అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నామని, మొత్తం 20 విభాగాల్లో అవార్డులను అందజేస్తామని, ఇకపై ప్రతీ ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన ఆర్.కె.గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ ఉపాధ్యక్షుడు గురురాజ్, అల్లా భక్షు, కో ఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠ భరితంగా రిస్క్

సందీప్ అశ్వ, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రిస్క్'. సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. జీకే మిరాకిల్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాని జూన్ రెండోవారంలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'సంగీత దర్శకునిగా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న నేను దర్శకునిగా చేస్తున్న తొలి ప్రయత్నమిది. సినిమా బాగా వచ్చింది. ఈ సినిమాకు 'రిస్క్' అనే టైటిల్ యాప్ట్. ఉత్కంఠను కలిగించేలా సినిమా ఉంటుంది. టీమ్ అంతా అకింతభావంతో పనిచేశారు. మ్యూజిక్ కూడా బావుంటుంది' అని ఘంటాడి కృష్ణ అన్నారు. ఇంకా హీరో సందీప్, 30ఇయర్స్ పృథ్వీ, మల్కాపురం శివకుమార్, అషురెడ్డి కూడా మాట్లాడారు.



EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/